ఆంధ్రజ్యోతి **

ANDHRAJYOTHY

సూర్యాపేట

5 | మంగళవారం 7 మే 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.151	219	249
సూర్యాపేట	రూ.155	230	260
నల్లగొండ	రూ.155	226	256

ఉష్ణోగ్రత గరిష్ఠం 41.0 । కనిష్ఠం 24.0

బీజేపీ ప్రభుత్వంతో నల్లగొండ సమగ్రాభివృద్ధి

పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



నల్లగొండ సభలో మాట్లాడుతున్న జేపీ నడ్డా, చిత్రంలో ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి

నల్లగొండ, మే 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కేంద్రంలో మూడోసారి కొలువుదీరే ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో నల్లగొండ జిల్లా సమగ్రాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా హామీ ఇచ్చారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి తరఫున నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. దేశంలోని యువత, మహిళలు, రైతులు సాధికారత సాధించాలంటే కేంద్రంలో మోదీ సర్కార్‌ను బలపరచాలని కోరారు. దేశవ్యాప్తంగా అవినీతిలేని గొప్ప పాలన గత పదేళ్లుగా మోదీ అందించారని పేర్కొన్నారు. ఎక్కడికి వెళ్లినా మళ్లీ మోదీ సర్కారే రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని అన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్ సగర్వంగా తలెత్తుకునేలా చేసిన ఘనకీర్తి మోదీదేనని తెలిపారు. కెనడాలో ఉండి వచ్చిన సైదిరెడ్డి లాంటివారికి మోదీ కీర్తి ఏ స్థాయిలో ఉందో తెలుసుకాబట్టే ఆయన మోదీ టీంలో చేరారని కొనియాడారు. దేశంలో పేదవర్గాలకు ఆర్థిక పరిపుష్టి అందించేందుకు, ఆహారభద్రత కల్పించేందుకు ఎన్నో పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేసిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమైందని, రోడ్లు, రైల్వేలైన్లు, విమానాశ్రయాల విస్తరణ జరిగిందని తెలిపారు. నల్లగొండ ఎంపీగా సైదిరెడ్డిని గెలిపించాలని, మోదీ నేతృత్వంలో ఆయన పనిచేసి ఈ ప్రాంత అభ్యున్నతికి పాటుపడతారని అన్నారు. నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ, నల్లగొండ అభివృద్ధిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు చర్చకు రావాలని సవాల్ చేశారు. వారసత్వంతో తాను రాజకీయాల్లోకి రాలేదని,ఈ ప్రాంత అభ్యున్నతి కోసం వచ్చానని పేర్కొన్నారు. తనను గెలిపిస్తే పార్లమెంట్ పరిధిలో యువతకు 50వేల ఉద్యోగాలిప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీ అమలుకు కోసం కేంద్రమంత్రి కిరణ్‌రిజిజు వచ్చినప్పుడు చెబితే ఆయన ఇక్కడ ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమలు, డ్రైపోర్టు ఏర్పాటుచేయిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. యువత, మహిళల సాధికారతకు తాను కృషి చేస్తానని పేర్కొన్నారు. నల్లగొండ గడ్డపై కాషాయజెండా ఎగరవేయడం ఖాయమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో తాను రెండు లక్షల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. సభలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు, గోలిమధుసూదన్‌రెడ్డి, భాగ్యరెడ్డి, నూకల నరసింహారెడ్డి, కంకణాల నివేదితారెడ్డి, లాలూనాయక్, మాదగాని శ్రీనివాస్‌గౌడ్, బండారు ప్రసాద్, పోతెపాక సాంబయ్య, పిల్లిరామరాజు, కన్మంతరెడ్డి శ్రీదేవి పాల్గొన్నారు.





విత్తన నాణ్యతపై నజర్

విత్తనాలు, ఎరువులు సిద్ధం



వానాకాలం సీజన్‌కు ముందే విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచాం. వ్యవసాయశాఖ ప్రణాళికకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నాం. ఈ సారి ఎండలు అధికంగా ఉండటం వల్ల మే నెలాఖరులో వర్షాలు భారీగా కురిస్తేనే విత్తనాలు విత్తాలి. లేదంటే పత్తి రైతులు పొడి దుక్కులో విత్తనాలు వేస్తే నష్టపోతారు. వానలు కురిసి భూమి చల్లబడిన తరువాతే విత్తనాలు విత్తాలి. ఈ సీజన్‌లో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కట్టుదిట్ట చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పోలీస్‌శాఖ ద్వారా పీడీ యాక్టును అమలు చేసి కేసులు నమోదు చేయిస్తాం. దళారీ వ్యవస్థపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టి రైతులను నుంచి చైతన్యం చేయడం కోసం వ్యవసాయశాఖ కృషి చేస్తోంది. రైతులు లైసెన్స్ ఉన్న దుకాణంలో విత్తనాలు కొనుగోలుచేసి బిల్లు తీసుకోవాలి.

– పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ, నల్లగొండ

- పత్తి, వరి, ఇతర విత్తనాల శాంపిళ్ల సేకరణ
- ఈ వానాకాలం సీజన్ నుంచి ప్రత్యేక ప్రణాళిక
- నాణ్యత తేలాకే కంపెనీలకు అనుమతులు

నాణ్యత లేని విత్తనాలు కొనుగోలుచేసి రైతులు పెట్టుబడులు నష్టపోకుండా ఉండేదుకు ఈసారి వ్యవసాయశాఖ ప్రత్యేకంగా విత్తన నాణ్యతపై దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పత్తి, వరితో పాటు ఇతర విత్తనాల నమునాలు సేకరించే పనిలో వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు. అందులో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు అధికారులు 400 శాంపిళ్లను సేకరించారు. వీటిలో ప్రధానంగా 100 శాంపిళ్లు పత్తి విత్తనాలు ఉన్నాయి.

– నల్లగొండ

గతంలో రైతులు వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి నకిలీ విత్తనాల కారణంగా దిగుబడులు రాక ఆర్థికంగా దెబ్బతిన్నారు. దీంతో ఈ వానాకాలం సీజన్ నుంచి వ్యవసాయశాఖ నూతన విధానాన్ని అమలులోకి తెచ్చింది. విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి విత్తన డీలర్ నుంచి స్టాకులోని ఏదో ఒక విత్తన ప్యాకెట్ సేకరిస్తారు. ఈ విధంగా మార్కెట్‌లో అనుమతి పొందిన అన్ని కంపెనీలకు చెందిన అన్ని రకాల విత్తనాలను కొద్ది రోజుల క్రితమే సేకరించిన అధికారులు వాటిని రాజేందర్‌నగర్‌లోని విత్తన పరిశోధన కేంద్రానికి పంపించారు. అక్కడ మొలక శాతంతో పాటు జన్యు పరీక్షలు కూడా నిర్వహించారు. దీంతో కొన్ని కంపెనీలకు అనుమతి ఇవ్వడంతో పత్తి విత్తనాల లక్ష ప్యాకెట్లు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి.

ఉమ్మడి జిల్లాలో 22.65లక్షల ఎకరాల్లో పంటల విస్తీర్ణం

వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 22.65లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. నల్లగొండ జిల్లాలో 11.50లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా. అందులో 5.70లక్షల ఎకరాల్లో పత్తి, 5.15 లక్షల ఎకరాల్లో వరి సాగు కానుండగా, మరో 65 వేల ఎకరాల్లో కంది, వేరుశనగ, మినుములు, ఇతర పప్పు దినుసు పంటలు సాగు కానున్నాయి. పత్తికి సంబంధించి 15లక్షల ప్యాకెట్ల విత్తనాలు అవసరమని వ్యవసాయశాఖ భావించి ఇప్పటికే లక్ష ప్యాకెట్లను అందుబాటులో ఉంచింది. ఒక్కో ప్యాకెట్ 450గ్రాముల వరకు ఉంటుంది. ఈ సారి పత్తి విత్తన ప్యాకెట్ల ధర ఒక శాతం మేరకు పెరిగింది. గత ఏడాది 450గ్రాముల ప్యాకెట్ ధర రూ.853 ఉండగా, ఈ ఏడాది రూ.864కు విక్రయిస్తున్నారు. అదేవిధంగా ఈ సీజన్‌లో వరి సన్న, దొడ్డు రకాలను రైతులు సేద్యం చేయనున్నారు. వరిలో దొడ్డు రకం 2.80లక్షల ఎకరాల్లో సాగు చేయనుండగా, సన్నరకం 2.25లక్షల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసి అందుకు అనుగుణంగా విత్తనాలను తెప్పించింది. ఇప్పటికే సన్నరకం వరి విత్తనాలు 47వేల క్వింటాళ్లు, దొడ్డు రకం విత్తనాలు 80వేల క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయి. వరి విత్తనాలపై సబ్సిడీకి సంబంధించి ప్రభుత్వం ప్రకటన చేయాల్సి ఉంది. ఎన్నికల కోడ్ అనంతరం సబ్సిడీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యాదాద్రి జిల్లాలో మొత్తం 4,91,260 పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. వరి 3.29లక్షల ఎకరాల్లో, పత్తి 1,21,471 ఎకరాల్లో, కంది 9,298 ఎకరాల్లో, ఇతర పంటలు 31,426 ఎకరాల్లో సాగవుతాయని అంచనా. సూర్యాపేట జిల్లాలో 6,24,260 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో వరి 4,65,500 ఎకరాల్లో, పత్తి 1.55లక్షల ఎకరాలకు పైగా సాగవుతుందని అంచనా. ఈ ఏడాది తీవ్ర ఎండలు ఉన్నందున పత్తి విత్తనాలను పొడి దుక్కులో వేయవద్దని వ్యవసాయశాఖ సూచిస్తోంది.

నకిలీ విత్తనాలపై నిఘా

గతంలో పెద్ద మొత్తంలో నకిలీ విత్తనాల డంప్ లభించడంతో పాటు అక్రమార్కులపై అధికారులు పీడీ యాక్ట్ కూడా నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా నకిలీ విత్తనాలపై పటిష్ఠ నిఘా ఉంచాలని అధికారులు నిర్ణయించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. పోలీస్‌శాఖ సహకారంతో వ్యవసాయశాఖ సమన్వయం చేసుకుంటూ ప్రత్యేకంగా తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. ప్రధానంగా ప్రముఖ విత్తన కంపెనీల లేబుళ్లను ప్యాకెట్లపై ముద్రించి సగానికి సగం ధర తగ్గించి విక్రయించడం లేదు, అదే ధరకు ఇవ్వడం చేస్తున్నారు. డబ్బు ఆలస్యంగా ఇచ్చినా తీసుకుంటామని చెప్పి కొంతమంది దళారులు రైతులకు నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లను గతంలో కట్టబెట్టిన ఘటనలు ఉన్నాయి. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి జిల్లా సరిహద్దుల మీదుగా గతంలో నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లు జిల్లాకు చేరాయి. వీటిని అరికట్టేందుకు వ్యవసాయశాఖ పటిష్ఠ నిఘా ఏర్పాటుచేసింది.. సీజన్‌కు ముందే 75వేల మెట్రిక్ టన్నుల యూరియాను సిద్ధంగా ఉంచారు.

పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేటక్రైం, మే 6 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పటిష్ఠమైన బందోబస్తు ఉంటుందని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని స్ట్రాంగ్ రూం నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలించడం మొదలు ఎన్నికల ముగిసి తిరిగి స్ట్రాంగ్ రూంలకు చేరేవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల పరిస్థితులను గమనిస్తూ పూర్తి భద్రత కల్పించడంలో రూట్ మొబైల్స్ సిబ్బంది ప్రధానమైన భూమికని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు రజితారెడ్డి, చరమందరాజు, ఎలక్షన్ సెల్ సిబ్బంది, టెక్నికల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రల్ ఆర్మ్‌డ్ సిబ్బంది వినియోగం

ఎన్నికల నిర్వహణలో జిల్లా పోలీస్ సిబ్బందికి అనుబంధంగా సెంట్రల్ ఆర్మ్డ్‌కు చెందిన సిబ్బంది తమిళనాడు, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా సిబ్బందికి గైడ్‌గా స్థానిక పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు. ఎన్నికల సామగ్రికి ఆర్మ్డ్ పోలీసులకు రక్షణ కల్పించడం, ఎస్కార్ట్, స్ట్రాంగ్ రూం గార్డ్స్, పోలింగ్ కేంద్రం వద్ద రక్షణ వంటి ముఖ్య విధులు ఉంటాయన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

'ప్రజావాణి'కి ఎనిమిది ఫిర్యాదులు

ప్రయాణ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. సోమవారం పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపరిచితులను నమ్మి బ్యాగ్స్, సంచులు ఇవ్వవద్దని సూచించారు. పండుగలు ఉత్సవాలు నిర్వహించే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. మొత్తం ఎనిమిది ఫిర్యాదులు అందాయని వివరించారు.

రైతుల ఖాతాల్లో రైతుబంధు జమ

- సోమవారం రాత్రి నాటికి 15 ఎకరాలలోపు రైతులకు అందిన పెట్టుబడి సాయం



నల్లగొండ, మే 6: రాష్ట్ర ప్రభుత్వం రైతు సాయాన్ని తిరిగి సోమవారం నుంచి జమ చేయడం ప్రారంభించింది. సీఎం రేవంత్‌రెడ్డి రెండు రోజుల క్రితం ఈ నెల 9వ తేదీ లోగా రైతుబంధును పూర్తిస్థాయిలో చెల్లిస్తామని ప్రకటించారు. సోమవారం రాత్రి 9గంటల లోపు 15 ఎకరాల లోపు పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు సమాచారం. కొద్ది రోజుల క్రితం వరకు ఐదు ఎకరాలలోపు మాత్రమే పెట్టుబడి సాయం అందిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కింద ఎకరాకు రూ.7500 వచ్చే వానాకాలం నుంచి చెల్లిస్తామని ప్రకటించగా, గత ప్రభుత్వం ప్రారంభించిన రైతుబంధును ఎటువంటి కటాఫ్ లేకుండా పూర్తిస్థాయిలో యాసంగి సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం చెల్లిస్తోంది. నల్లగొండ జిల్లాలో మొత్తం 5,15,354 మందికి రూ.609.35కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. కొద్దిరోజుల క్రితం వరకు 4,71,185 మంది రైతులకు రూ.433.48కోట్లకు పైగా పెట్టుబడి సాయంగా చెల్లించింది. సోమవారం రాత్రి వరకు 15 ఎకరాలకు పైగా సాయం చెల్లించినట్టు సమాచారం.

యాదాద్రి జిల్లాలో కొద్దిరోజుల వరకు 1,81,063 మంది రైతులకు సుమారు రూ.125కోట్లకు పైగా జమయ్యాయి. అదేవిధంగా సూర్యాపేట జిల్లాలో 2,93,689 మంది రైతులకు గాను కొద్దిరోజుల వరకు 2,20,000 మంది రైతులకు రూ.140కోట్ల వరకు జమయ్యాయి. సోమ, మంగళవారాల్లో మిగతా రైతులకు రైతుబంధు సాయం జమ కానుంది.

కేసీఆర్ మాదిరే మోదీకి గుణపాఠం చెప్పాలి

- రఘువీర్‌రెడ్డికి చరిత్రలో నిలిచిపోయేలా మెజార్టీ ఇవ్వాలి
- సీపీఐ జనరల్‌బాడీ సమావేశంలో మాజీ మంత్రి జానారెడ్డి



సీపీఐ జనరల్‌బాడీ సమావేశంలో మాట్లాడుతున్న జానారెడ్డి

దేవరకొండ, మే 6 : రాష్ట్రంలో కేసీఆర్‌కు చేసిన మాదిరే కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. సోమవారం దేవరకొండలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన దేవరకొండ, నల్లగొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల సీపీఐ జనరల్‌బాడీ సమావేశంలో నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలో కమ్యూనిస్టుపార్టీకి సుదీర్ఘ చరిత్ర ఉందన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు మిత్రపక్షంగా ఎన్నికల్లో పాల్గొన్న సందర్భాలు అనేకం ఉన్నాయని గుర్తుచేశారు. రావి నారాయణరెడ్డి మాదిరిగానే నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని ఢిల్లీ చరిత్రలోనే నిలిచిపోయేలా మెజార్టీ ఇవ్వాలన్నారు. దేశంలో ఇండియా కూటమి బలపడిందని, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీగా గెలిపిస్తే ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందిస్తామన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల నాయకులకు, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. పోలింగ్‌శాతం అధికంగా నమోదయ్యేలా చూసే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను పట్టించుకోలేదని విమర్శించారు. దేవరకొండ నియోజకవర్గంలో అసమర్థ ప్రజా ప్రతినిధులు ఉండడం వల్లే కరువు పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఏకమైతే భారీ మెజార్టీతో గెలుపుఖాయమన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం ప్రజా, రైతువ్యతిరేక విధానాలను అవలంభిస్తూ రాజ్యాంగంతో పాటు రిజర్వేషన్లు మార్చేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నేలకంటి సత్యం, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, అంజయ్య నాయక్, సీపీఐ నాయకులు పల్లా నర్సింహ, దేవేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్‌నాయకులు సిరాజ్‌ఖాన్‌తో పాటు దేవరకొండ, నాగార్జునసాగర్, నల్లగొండ నియోజకవర్గాలకు చెందిన సీపీఐ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం అవినీతి ఊబిలో కూరుకుపోయిన బీజేపీ ప్రభుత్వం పుస్తకాన్ని జానారెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్‌తోపాటు నాయకులు ఆవిష్కరించారు.

నేడు కోదాడకు రాజస్థాన్ సీఎం భజన్‌లాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా బీజేపీ ఇన్‌చార్జి చాడ వెంకటరెడ్డి

కోదాడ టౌన్, మే 6 : కోదాడలో మంగళవారం నిర్వహించే బీజేపీ బహిరంగ సభకు రాజస్థాన్ రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్‌లాల్ వస్తున్నట్లు బీజేపీ జిల్లా ఇన్‌చార్జి చాడ వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. మధ్యాహ్నం రెండు గంటలకు సూర్యాపేట రోడ్డులోని నాగుబండి రామ్మూర్తినగర్ గ్రౌండ్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించుకోవాలని సూచించారు. ఇందుకోసం ప్రతి ఒక్క బీజేపీ నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణ చర్యలు చేపట్టాలి

సూర్యాపేట(కలెక్టరేట్),మే 6: వేసవి తీవ్రత నేపథ్యంలో పశువుల సంరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ కుమారస్వామి సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలో పశువుల సంరక్షణపై మండల వైద్యాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో పశువులకు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రతి గ్రామాల్లో రెండు నీటి తొట్లు ఉండేలా పంచాయతీల సహకారంతో ఏర్పాటు చేయాలన్నారు. పశువులను ఉదయం ఆరు నుంచి 10గంటల లోపు అలాగే సాయంత్రం నాలుగు గంటల తర్వాతనే మేతకు బయటకు పంపాలన్నారు. పక్షులకు తాగునీటి కోసం పాత్రల్లో మంచినీరు అందుబాటులో ఉంచేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పెంటయ్య, బి.వెంకన్న, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, మే 6: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో సోమవారం లక్ష్మీనృసింహుని నిత్యకల్యాణాన్ని అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, ఆంజనేయాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం కల్యాణోత్సవంలో మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో నిత్యకల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

అంతటా అతలాకుతలం



నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెంలో నేల రాలిన మామిడి కాయలను చూపుతున్న రైతు

పంట నష్టం వాటిల్లడంతో

కౌలులో కొంత మొత్తం తిరిగిచ్చిన రైతు

•7లో..

ఈవీఎం కమీషనింగ్ ప్రక్రియ పారదర్శకంగా చేయాలి



ఈవీఎం స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న కలెక్టర్

సూర్యాపేట(కలెక్టరేట్), మే 6 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంల కమీషనింగ్(బ్యాలెట్ పేపర్ అనుసంధానం) ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో సూర్యాపేట నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎం కమీషనింగ్, మాక్ పోల్ విధానాన్ని పరిశీలించి,మాట్లాడారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈవీఎం కమీషనింగ్ ప్రక్రియ అలాగే మాక్ పోల్ అప్రమత్తంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్,తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణయ్యమహేందర్‌రెడ్డి, పీ వెంకటేశ్వర్లు,ఎన్నికల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఆత్మకూర్(ఎస్) : వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కలెక్టర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అవకతవకలు చోటుచేసుకోకుండా కొనుగోలు చేపట్టాలన్నా రు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ అన్నిచర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు వచ్చేలోపు మిగిలిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వినోద్‌కుమార్, ఇంద్రకుమార్, పీఏసీఎస్ సీఈవో లక్ష్మారెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఏకత్వాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ కుట్ర

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

రామన్నపేట, మే 6 : దేశంలో ప్రత్యేక పరిస్థితుల్లో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయని, బీజేపీ దేశ భిన్నత్వంలోని ఏకత్వాన్ని దెబ్బతీసే కుట్ర పన్నుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం రాత్రి యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటలో భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. పేదల కష్టం తెలిసిన నిబద్ధత గల నాయకుడు జహంగీర్‌ను అధికమెజార్టీతో గెలిపించాలని కోరారు. ఫాసిస్టు విధానాలను బీజేపీ అవలంభించిందని, బీజేపీ ప్రమాదాన్ని ప్రజలు పసిగట్టకపోతే దేశం అంధకారంలోకి పోతుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రజలను అంధకారంలోకి నెడుతుందన్నారు. రాష్ట్రంలో కమ్యూనిస్టుల ప్రాబల్యం ఉన్న భువనగిరి పార్లమెంట్‌కు 35 ఏళ్ల ప్రజాఉద్యమంలో ఉన్న జహంగీర్‌ను సీపీఎం అభ్యర్థిగా నిలబెట్టిందన్నారు. నిస్వార్థంగా, నిజాయితీగా ప్రజల కోసం పని చేసే జహంగీర్‌ను గెలిపించాలన్నారు.

జహంగీర్ గెలుపుతోనే రామన్నపేట ప్రాంత అభివృద్ధి

దశాబ్దాలుగా అభివృద్ధిలో వెనుకబాటుకు గురవుతున్న రామన్నపేట ప్రాంత సమస్యలు తెలిపిన జహంగీర్‌తోనే సాధ్యమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. గతంలో రామన్నపేట నియోజకవర్గంగా ఉండి అనేక డివిజనల్ ప్రభుత్వ ఆఫీసులు ఉన్నా ప్రస్తుతం ఒక్కొక్కటీ మాయం అవుతున్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి శిథిలావస్థకు చేరిందన్నారు. ర్యాలీలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి, పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేక అశోక్‌రెడ్డి, కల్లూరి మల్లేశం, అనగంటి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యుడు జెల్లల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు కూరెళ్ల నర్సింహాచారి, మామిడి వెంకట్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు వేముల ఆనంద్, జిల్లా అధ్యక్షుడు గంటేపాక శివకుమార్, వైస్‌ఎంపీపీ నాగటి ఉపేందర్, బోయిని ఆనంద్, గాదె నరేందర్, మీర్ ఖాజాఅలీ, కల్లూరి నగేష్, కందుల హనుమంతు, నీల అయిలయ్య పాల్గొన్నారు.



రామన్నపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న వీరభద్రం, పక్కన అభ్యర్థి జహంగీర్

ఐక్యతతో బీజేపీని ఓడించడం సులువే

చిట్యాల రూరల్ : ప్రతిపక్షాల ఐక్యతతో నియంతృత్వ బీజేపీని రాష్ట్రంలో, దేశంలో ఓడించడం సులువేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామశివారులో ఆయన సోమవారం విశ్రాంతి కోసం ఆగారు. ఈ సందర్భంగా పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దేశంలోని పార్టీలను బీజేపీ తన గుప్పిట్లోకి తీసుకువచ్చేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తోందని, దాని ద్వారా లబ్ధిపొందడం తాత్కాలిక ఆనందమేనని అన్నారు. అది ఏనాటికైనా క్షమార్హం కాదన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థులకు తాము మద్దతు ఇస్తామన్నారు. తప్పని పరిస్థితుల్లో భువనగిరి స్థానంలోనే తమ అభ్యర్థి పోటీలో ఉన్నారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, నాయకుడు శీలా రాజయ్య పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటి తొట్లు

● దాహార్తి తీరక మూగజీవాల విలవిల

భువనగిరి రూరల్, మే 6: యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలో పర్యవేక్షణ కరువై మూగజీవాల కోసం ఏర్పాటు చేసిన నీటితొట్లు నిరుపయోగంగా మారాయి. కొన్నిచోట్ల నీటి వసతి లేకపోవడంతో పాటు చాలాచోట్ల పంచాయతీ అధికారుల, సిబ్బంది నిర్లక్ష్యంతో వృథాగా మిగిలిపోతున్నాయి.దీంతో వేసవిలో ఎండల తీవ్రతకు తాగునీటి కోసం మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. ఇదిలా ఉండగా 2003లో టీడీపీ ప్రభుత్వ హయాంలో మూగజీవాలకు తాగునీరు అందించే ఉద్దేశంతో జన్మభూమి పథకం కింద మేజర్ గ్రామ పంచాయతీల్లో మూడు నీటితొట్లు, చిన్న గ్రామపంచాయతీల్లో ఒకటి చొప్పున నీటితొట్టిని నిర్మించారు. ఒక్కో నీటితొట్టికి రూ.50వేలు వెచ్చించి గ్రామశివారులోని ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటుచేశారు. అయితే మొదట్లో పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో వాటర్‌మన్‌లు ప్రతి రోజూ తొట్లలో నీటిని నింపుతూ మూగజీవాల దాహార్తి తీర్చేందుకు కృషి చేసేవారు. ముఖ్యంగా ప్రతీ వేసవిలో నీటితొట్లకు మరమ్మతులు చేపట్టి వాటిలో నీటిని నింపి పర్యవేక్షించేవారు. ప్రస్తుతం భువనగిరి మండలంలో నీటితొట్లు వృథాగా పడిఉన్నాయి. రామచంద్రాపురం, వీరవెల్లి, ముత్తిరెడ్డిగూడెం, గంగసానిపల్లి, కూనూరు గ్రామాల్లో నీటితొట్లు ఉన్నప్పటికీ నీటివసతి లేకపోవడంతో వృథాగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో మూగజీవాల కోసం గ్రామాల్లో నీటి తొట్లను వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.



రామచంద్రాపురంలో నీరులేక నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

డిండి రిజర్వాయర్ కాలువలోపడి వ్యక్తి మృతి

డిండి, మే 6 : నల్లగొండ జిల్లా డిండి రిజర్వాయర్ కాల్వలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణానికి చెందిన మధునాగుల మోనేష్(34) గోనబోయినపల్లి స్టేజీ వద్ద ఓ ఫంక్షన్‌హాల్‌లో జరుగుతున్న శుభకార్యానికి వచ్చాడు. మోనేష్ ఫంక్షన్‌హాల్ పక్క నుంచి వెళ్తూ కాల్వలో పడి మృతి చెందాడు. అటుగా వచ్చినవారు గుర్తించి మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. మోనేష్ మద్యం తాగి ఉన్నాడు. ఆయనకు భార్య కుమార్తె ఉన్నారు. మోనేష్ బంధువు వట్టెం విష్ణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి ..

గుర్రంపోడు, మే 6 : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం మొసంగి గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ బీ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మొసంగి గ్రామానికి చెందిన నడ్డి శ్రీను(40)ను అదే గ్రామానికి చెందిన శీలం సైదాబాబా, చల్లా శంకర్‌లు వర్షం వచ్చేలా ఉందంటూ మిరపకాయలపై కప్పు కప్పేందుకు ఆదివారం తీసుకెళ్లారు. అదేరాత్రి సైదాబాబు, శంకర్‌లు ఇంటికి వచ్చి నిద్రించగా శ్రీను ఇంటికిరాలేదు. సోమవారం గ్రామానికి చెందిన నడ్డి సైదయ్య గ్రామ శివారులోని ముత్యాలమ్మగుడి ముందు నడ్డి శ్రీను మృతి చెంది ఉండడాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చాడు. తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని, శీలం సైదాబాబు, చల్లా శంకర్‌లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని భార్య రమణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మృతుడి శరీరం ఎడమవైపు కాలిపోయి ఉందని మిగతా ఇద్దరు పిడుగుపాటు వల్ల తాము స్పృహ కోల్పోయామని, స్పృహలోకి వచ్చిన తర్వాత ఇంటికి చేరుకున్నామని చెప్పారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీనుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



నడ్డి శ్రీను(ఫైల్)

వృద్ధురాలి మృతదేహం లభ్యం

నడిగూడెం, మే 6 : సూర్యాపేట జిల్లా నడిగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని త్రిపురవరంలో వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొమ్ము అలివేలు(70) అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండగా స్థానికులు గమనించి సమాచారం అందించారన్నారు. కాగా అలివేలును హుస్సేన్ అనే వ్యక్తి మరో వ్యక్తికి కలిసి హత్య చేసినట్లు ఆమె మనమడు సాయికృష్ణ ఫిర్యాదు చేశాడని, ఆ మేరకు కేసు నమోదు చేసుకునిదర్యాప్తు చేస్తున్నామన్నారు.



అలివేలు(ఫైల్)

రేషన్ బియ్యం పట్టివేత

వేములపల్లి, మే 6 : నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. పాములపాడు గ్రామంలో అలుగుబెల్లి అరుణ ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం అందడంతో దాడి చేయగా నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారించగా రావువారిగూడెం రేషన్ డీలర్ సతీష్‌రెడ్డి నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆమె తెలిపిందన్నారు. ఈ మేరకు అరుణ, సతీష్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యాదగిరికొండపై హరిహరులకు పూజలు

భువనగిరి అర్బన్, మే 6 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి కొలువైన యాదగిరికొండపై సోమవారం హరిహరులకు విశేషపూజలు కొనసాగాయి. స్వయంభువులకు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, అనుబంధంగా కొనసాగుతున్న పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమ శాస్త్రరీతిలో నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామి, అమ్మవారలను మేల్కొల్పిన అర్చకస్వాములు, మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలిపూజలు చేపట్టి సుదర్శనహోమం, నిత్యకల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయ ముఖమండపంలోని స్ఫటిక మూర్తిని అర్చకులు పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. కాగా, ప్రసాదాల తయారీ కేంద్రం, కౌంటర్‌ను ఈవో పరిశీలించారు. అడ్మినిస్ట్రేషన్ ఏఈవో గట్టు శ్రావణ్, ప్రసాదాల విభాగం సూపరింటెండెంట్ అశోక్‌తో కలిసి లడ్డూ ప్రసాదం రుచి చూసిన ఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తుల రద్దీ సాధారణంగా ఉన్నట్లు అధికారులు తెలపగా ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ23,32,660 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



ప్రధానాలయంలో నిత్య కల్యాణ పూజల్లో పాల్గొన్న పూజారి

కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో పెడతాం: రాజగోపాల్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్ / తుర్కపల్లి, మే 6 : తెలంగాణ సంపదను దోచుకున్న కేసీఆర్ కుటుంబాన్ని రాబోయే రోజుల్లో జైల్లో పెడతామని మునుగోడు ఎమ్మెల్యే, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం యాదగిరిగుట్ట పట్టణంతో పాటు తుర్కపల్లి మండల కేంద్రంలో భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఐదుగురు ఎంపీలు పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నామని ఆ రాష్ట్రాన్ని కేసీఆర్ తన స్వార్థం కోసం వాడుకుని ప్రజలను అన్నివిధాలుగా మోసం చేశారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అయిలయ్యకు ఇచ్చిన మెజార్టీ కంటే ఎక్కువగా ఇచ్చి కిరణ్ కుమార్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ కేసీఆర్ యాదగిరిగుట్టను అభివృద్ధి పేరుతో సర్వనాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ చీర శ్రీశైలం, గుట్ట మునిసిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్ గౌడ్, నాయకులు కానుగు బాలరాజ్‌గౌడ్, బందారపు భిక్షపతిగౌడ్, గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశ్‌యాదవ్, గౌలికార్ అరుణారాజేష్, బీట్ల సరోజహరీష్, ఆలేరు మాజీ మార్కెట్ చైర్మన్ ధానావత్ శంకర్‌నాయక్, తుర్కపల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్‌రెడ్డి, నాయకులు జనగాం ఉపేందర్‌రెడ్డి, ఎలుగల రాజయ్య, నీలం పద్మ పాల్గొన్నారు.

అంతటా అతలాకుతలం

● అకాల వర్షం.. కోలుకోలేని నష్టం ● మామిడి తోటల్లో నేలరాలిన కాయలు ● తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకున్న రైతులు ● పలుచోట్ల కూలిన కోళ్ల షెడ్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం రైతులకు నష్టం కలిగించింది. ఈదురు గాలులు, వడగండ్ల వర్షానికి పలు మండలాల్లో మామిడి తోటలు కూలి నేల మట్టమయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో ఉంచిన ధాన్యం తడిసింది. తడిసిన ధాన్యాన్ని రైతులు సోమవారం ఆరబెట్టారు.

నేరేడుచర్ల, మే 6: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని బక్కయ్యగూడెం, కల్లూరు గ్రామాల్లో మామిడి తోట రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కల్లూరులో రైతులకు సుమారు రూ.3లక్షలు నష్టం వాటిల్లగా, బక్కయ్యగూడెంలో కర్నెం సత్యనారాయణ, కర్నెం నర్సయ్య, కర్నెం అరవిందులకు చెందిన మామిడితోటలకు భారీ నష్టం వాటిల్లింది చేతికొచ్చిన పంట రాలి కాయ పగిలిపోవడంతో రైతులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు.

తిరుమలగిరి రూరల్: మండలంలోని తాటిపాముల గ్రామానికి చెందిన మానుపాటి మల్లయ్య ఇంటి పై కప్పు లేచిపోయింది. రేకులపై ఉన్న రాళ్లు ఇంట్లో ఉన్న మల్లయ్య, అతని భార్య లక్ష్మమ్మలపై పడగా మల్లయ్య, లక్ష్మమ్మల తలలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని సూర్యాపేట ఆసుపత్రికి తీసుకెళ్లారు. తొండ గ్రామానికి చెందిన ఇస్తారి ఇంటి పై కప్పు రేకులు లేచిపోయాయి. జలాల్‌పురం గ్రామానికి చెందిన దొంగిరి సోమయ్య మామిడి తోటలో మామిడికాయలు ఈదురు గాలులకు రాలిపోవడం వల్ల సుమారు రూ.50 వేలు నష్టం జరిగిందని రైతు తెలిపాడు.

తిరుమలగిరి: గాలిదుమారంతో కూడిన వర్షానికి తిరుమలగిరి మునిసిపా లిటీ పరిధిలో పంటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయ కోతదశలో గాలికి నేలరాలింది. ఈఏడాది కాత కూడా తక్కువే కాశాయని, గాలివానకు కాయలన్నీ నేలరాలాయని, పెట్టుబడులు కూడా వచ్చేది కష్టమేనని తోటల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులకు పలు ఇళ్ల రేకుల లేచిపోయాయి. చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.

పెన్‌పహాడ్: గాలి దుమారానికి మామిడి తోటల్లో కాయలు నేలరాలయి. అధికారులు పంట నష్టం అంచనా వేయాలని బాధిత రైతులు కోరారు. గాలి దుమారానికి పలు గ్రామాల్లో చెట్లు రోడ్డుకు అడ్డంగా కూలాయి. విద్యుత్ స్తంభాలు విరిగాయి. విద్యుత్ తీగలు రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

అర్వపల్లి: మండలంలోని జాజిరెడ్డిగూడెం గ్రామంలో ఈదురు గాలులకు విద్యుత్ స్తంభం కూలిపోయింది. పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. గ్రామంలో ఓ ఇంటి రేకులు లేచిపోయాయి.

గరిడేపల్లి: మండలంలోని కల్మలచెర్వు గ్రామానికి చెందిన రైతు దొంతి రెడ్డి వెంకట రమణారెడ్డికు చెందిన నాలుగు ఎకరాల మామిడి తోటలోని మామిడి కాయలు రాలాయి. సుమారు రూ.1.20 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

విద్యుదాఘాతంతో పశువులు మృతి



వేములపల్లి, నాగారం: విద్యుదాఘాతానికి గురై గేదెలు మృతిచెందాయి. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన చింతరెడ్డి సైదిరెడ్డి, లేకిరెడ్డి మంగమ్మల పాడి గేదెలు ఇంటి నుంచి మేతకు గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లాయి. గేదెలు మేత మేసుకుంటూ వెళ్తున్న క్రమంలో పొలం గట్టు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి సపోర్టుగా ఉన్న తీగను తాకడంతో విద్యుదాఘాతానికి గురై గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన పాడి గేదెలు ఒక్కొక్కటి సుమారు రూ.40వేల వరకు ఉంటాయని బాధిత రైతులు తెలిపారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లా నాగారం మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం పిడుగుపాటుతో రైతు శీలా శ్రీశైలానికి చెందిన కాడెద్దు మృతిచెందింది. కాడెద్దు విలువ సూమారు రూ.80వేలు ఉంటుందని రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

డిండి: మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. వేసవి తాపానికిలోనైన ప్రజలకు చిరు జల్లులతో కూడిన వర్షం కొంతమేర ఉపశమనం కలిగించింది. సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. 10 రోజులుగా తీవ్ర ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు వర్షంతో కొంతమేర ఉపశమనం కలిగింది.



చింతలపాలెం మండలం రేపల్లెలో నెలకొరిగిన బొప్పాయి తోటలు

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



త్రిపురారం: మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. సత్యనారాయణపురం సమీపంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గాలులకు ధ్వంసమైంది. త్రిపురారం నుంచి విద్యుత్ సరఫరా అయ్యే 33కేవీ లైన్‌కు మెరుపులు పిడుగుపాట్లకు సుమారు 10 విద్యుత్ స్తంభాలపై ఇన్సులేటర్లు పగిలిపోయాయని ఏఈ రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలానికి పూర్తిగా విద్యుత్ సరఫర నిలిచిపోవడంతో తాత్కలికంగా ఉన్న విద్యుత్ లైన్ల ద్వారా విద్యుత్ పునరుద్ధరించామని తెలిపారు. .

తిప్పర్తి: మండలంలోని శిలార్‌మియాగూడెం, మామిడాల, ఆరెగూడెం వంటి గ్రామాల్లో విద్యుత్ స్తంభాల తీగలు తెగడంతో సోమవారం విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మండల పరిదిలోని చిన్నాయిగూడెం గ్రామంలో పల్లె పూర్ణచందర్ ఇల్లు పైకప్పు పూర్తిగా లేచిపోయింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని యువకుడు కోరాడు.

పిడుగుపాటుతో గీతకార్మికుడి మృతి



తలారి ఊషయ్య(ఫైల్)

కనగల్: నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని జీఎడవల్లి గ్రామంలో పిడుగుపాటుకు గురై గీతకార్మికుడు మృతిచెందాడు. ఎస్‌ఐ రామక్రిష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తలారి ఊషయ్య(59) రోజువారిగా ఆదివారం సాయంత్రం తన వ్యవసాయ భూమిలోని తాటిచెట్టు నుంచి కల్లు తీస్తుండగా ఉరుములు మెరుపులతో కూడిన ఈదురుగాలుల వర్షం ప్రారంభమైంది. ఈక్రమంలో ఊషయ్య తాటిచెట్టుపై నుంచి కిందికి దిగుతుండగా అతనిపై పిడుగుపడింది. దీంతో తీవ్రగాయాలకు గురై కింద పడి అతను అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు గణేష్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వివరించారు.

నూతన్‌కల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షంతో రాక పోకలకు, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలకేంద్రంలోని ప్రధాన రహదారిపై చెట్లు విరిగి పడడంతో ట్రాఫిక్ ఆగిపోయింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సైదులు విరిగిన చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈదురుగాలులతో మద్ది విజయ మామిడి తోటలో చెట్లు వేర్లతో సహా కూలి పోయి కాయలు రాలి తీవ్ర నష్టం ఏర్పడింది.

మేళ్లచెర్వు: ఉమ్మడి మేళ్లచెర్వు మండలంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు బీభత్సవం సృష్టించాయి. రోడ్డు పక్కన చెట్లు పడిపోవటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. చింతలపాలెం మండలకేంద్రంలో ఉరుములు, మెరుపులతో పాటు వడగండ్ల వర్షం కురిసింది.



మర్రిగూడ : తిరుగండ్లపల్లిలో నేలమట్టమైన మామిడి చెట్లు

శాలిగౌరారం: మండలంలో ఆదివారం రాత్రి అకాల వర్షంతో పాటు భారీ ఈదురుగాలులకు అపార నష్టం కలిగింది. 15విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. నిమ్మ, మామిడి కాయలు నేల రాలాయి. 10 ఇళ్ల కప్పులు లేచిపోయాయి. రెండు ఇళ్లు పూర్తిగా కూలిపోయాయి. తుడిమిడి గ్రామానికి చెందిన బండారు యాదయ్య మామిడి తోటలో తోట ధ్వంసమై మామిడి కాయలు రాలిపోయాయి. పెర్కకొండారంలో మంగదుడ్ల బలరాంకు చెందిన మూడు ఎకరాల నిమ్మ తోట ధ్వంసమై నిమ్మకాయలు నేల రాలాయి. గురజాలలో చాట్ల బయన్న ఇల్లు పూర్తిగా లేచిపోయింది. సంబంధిత అధికారులు పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని బాధితులు కోరుతున్నారు.

ఆత్మకూర్(ఎస్): మండలంలోని పాతర్లపాడులో ట్రాన్స్‌ఫార్మర్ కింద పడిపోయి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దాసరి జీవయ్య ఇంటిపై కప్పు రేకులు లేచిపోయాయి. మానుపూరి శ్రీనుతో పాటు మరికొందరు నిరుద్యోగులు సుమారు రూ. 20లక్షలతో ఏర్పాటు చేసిన దుస్తుల నేత కేంద్రం గాలివానకు పూర్తిగా ధ్వంసమైంది. మిషన్‌లు వర్షానికి పాడయ్యాయి. ఆత్మకూర్(ఎస్) మండలకేంద్రంలో సాగుచేసిన మొక్కజొన్న తోటలు దెబ్బతిన్నాయి. రామోజీతండాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసింది. విద్యుత్ స్తంభాలు విరగడంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



తిరుమలగిరి మండలంలో రాలిన మామిడి కాయలు

పంట నష్టాన్ని పరిశీలించిన అధికారులు



నేల రాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న అధికారులు

సూర్యాపేటరూరల్ : అకాల వర్షాలతో, ఈదురు గాలులకు రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి టి. నాగయ్య అన్నారు. సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో ఆదివారం రాత్రి వచ్చిన అకాలవర్షానికి, ఈదురుగాలులకు నెలరాలిన మామిడి తోటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పది మండలాలలో 1429 ఎకరాలలో మామిడి, 18 ఎకరాల్లో అరటి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. పంటనష్టం నివేదికను వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బంది ద్వారా సేకరించి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో సూర్యాపేట ప్రాంతీయ ఉద్యాన అధికారి కన్న జగన్, రైతులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారం నేలమట్టం.. రూ.15 లక్షలు నష్టం



బుద్దారంలో నేలమట్టమైన కోళ్ల ఫాం

నల్లగొండ రూరల్: నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలో అకాల వర్షం, ఈదురు గాలులతో నష్టం వాటిల్లింది. ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులతో చెట్లు నేలకొరిగాయి. వ్యవసాయ బావుల వద్ద ఉన్న పశువుల కొట్టాలు గాలికి పైకప్పులు లేచిపోయాయి. మండల పరిధిలోని బుద్దారం గ్రామపంచాయతీ చెందిన తుక్కని వెంకటరెడ్డి కోళ్ల షెడ్డు పూర్తిగా నేలమట్టమైంది. సుమారు 30వేల కోడి పిల్లలు మృతిచెందాయి. సుమారు రూ.15లక్షలు నష్టపోయినట్లు బాధిత రైతు తెలిపాడు. తనకు జీవనాధారమైన కోళ్ల షెడ్డు ధ్వంసమైందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

దెబ్బతిన్న మామిడి తోటలు



నేలరాలిన మామిడి కాయలు చూపిస్తున్న రైతులు

కోదాడ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వీచిన ఈదురు గాలుల వల్ల మామిడి పంటకు తీవ్రనష్టం జరిగింది. ఈ సంవత్సరం మామిడి పూత పూయక, కాయలు కాయక ఆందోళన చెందుతున్న రైతులకు ఈదురు గాలులు నష్టం కలిగించాయి. మండలంలోని గుడిబండ, కాపుగల్లు, రెడ్లకుంట, తొగర్రాయి గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా మామిడి తోటలు ఉన్నాయి. సరైన వర్షాలు కూడా లేకపోవడంతో కాచిన కొద్దిపాటి కాయ కూడా సైజు రాకుండా పిందెలుగానే మిగిలిపోయాయి. దీంతో కౌలుకు తీసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోయామని తెలిపారు. ఉన్న కొద్దిపాటి మామిడికాయలను కోసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఈదురు గాలుల వల్ల పూర్తిగా కాయలు రాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



మర్రిగూడ: ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు, వడగండ్ల వర్షానికి మామిడి తోటలు కూలి నేలమట్టమయ్యాయి. మండలంలోని తిరుగండ్ల గ్రామానికి చెందిన యాస అమరేందర్‌రెడ్డికి చెందిన రెండు ఎకరాల మామిడి తోట వేర్లతో సహా నేల మట్టమైంది. ఈదురు గాలులకు మామిడి కాయలు రాలాయి. మర్రిగూడకు చెందిన వీరమళ్ల నర్సింహ అనే రైతుకు చెందిన మామిడితోట చెట్లు విరిగి కాయలు రాలి పూర్తిగా దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన కాయలు వడగండ్ల వానతో నేలకు రాలడంతో నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. మండలంలోని ఎరుగండ్లపల్లి, మర్రిగూడలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని తహసీల్దార్ పరిశీలించారు. తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేయాలని మిల్లు యజమానులతో చర్చించారు. మిల్లు యజమానులు అనుమతి ఇవ్వడంతో తహసీల్దార్ నిర్వహకులకు చెప్పి లారీకి ధాన్యం లోడ్ చేయించారు.

దాతృత్వం చాటుకున్న రైతు

కోదాడ రూరల్: సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని గుడిబండ గ్రామానికి చెందిన శ్రీనివాసుల ప్రసాద్‌రెడ్డి అనే రైతు తనకున్న ఎనిమిది ఎకరాల మామిడి తోటను ఈ సంవత్సరం రెండు లక్షలకు కౌలుకు ఇచ్చాడు. కౌలుదారు నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన శ్రీరాములు కౌలుకు తీసుకున్నప్పటి నుంచి కాయ కాసే వరకు మరో లక్ష రూపాయలు ఖర్చు పెట్టాడు. అయినప్పటికీ అతనికి రెండు లక్షల వరకు కూడా కాయ వచ్చే అవకాశం లేకపోవడంతో ప్రసాద్‌రెడ్డి తనకిచ్చిన రెండు లక్షల్లో శ్రీరాములుకు రూ.60 వేలను సోమవారం తిరిగి ఇచ్చి దాతృత్వం చాటుకున్నారు. శ్రీరాములు తోట తీసుకున్న దగ్గరి నుంచి అనేక కష్టనష్టాలకు గురై నష్టపోయే అవకాశం ఉందని భావించి రూ.60 వేలు తిరిగి ఇచ్చినట్లే తెలిపారు.

కూలిన కోళ్ల షెడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే సామేల్

అడ్డగూడూరు: యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని మానాయికుంటా గ్రామానికి చెందిన మేడబోయిన లింగయ్య కోళ్ల షెడ్ రేకులు ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు లేయిపోయాయి. దీంతో సూమారు రూ.10లక్షల నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ కోళ్ల షెడ్డును పరిశీలించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. మండలంలోని కోటమర్తి గ్రామానికి చెందిన చిప్పలపల్లి బాలమల్లు పిడుగుపాటుతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.



కూలిన కోళ్ల షెడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సామేల్



తిరుమలగిరి మండలంలో రాలిన మామిడి కాయలు చూస్తున్న రైతు



పాతర్లపహాడ్ స్టేజీ వద్ద కూలిన దుస్తుల మిల్లు



రామోజీతండాలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం



పాతర్లపహాడ్ స్టేజీ వద్ద కూలిన రేకుల ఇల్లు

ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి

● నల్లగొండ జిల్లా దామరచర్లలో 45.7 డిగ్రీల ఉష్ణోగ్రత ● కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యం ఆరబెట్టిన రైతులు



నల్లగొండ శివారు అర్జాలబావిలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు



నల్లగొండ జిల్లాకేంద్రంలో కుండలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

నల్లగొండ, మే 6: ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఆదివారం సాయంత్రం ఉరుములు, ఈదురు గాలులతో కురిసిన వర్షానికి కాస్త చల్లబడిన వాతావరణం సోమవారం ఎండ తక్కువగా ఉన్నా ఉక్కపోతతో జనం అల్లాడారు. ఎండతో మధ్యాహ్నం ప్రధాన రహదారులన్నీ ఖాళీగా కనిపించాయి. ఆదివారం కురిసిన వర్షానికి ఉమ్మడి జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. తడిసిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో అత్యధికంగా 45.7 డిగ్రీలు, చింతపల్లి మండలంలో అత్యల్పంగా 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారంలో అత్యధికంగా 45.0డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. యాదగిరిగుట్టలో 44.0, రాజపేటలో 43.5, భువనగిరిలో 43.1, ఆత్మకూరులో 42.8,చౌటుప్పల్‌లో 42.6, బీబీనగర్‌లో 42.3, అడ్డగూడూరులో 42.1, మోత్కురులో 42.0, వలిగొండలో 41.9, నారాయణపూర్‌లో డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో అత్యధికంగా 45.5 డిగ్రీలు, కోదాడ మండలంలో అత్యల్పంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అదేవిధంగా మోతెలో 44.6, మట్టంపల్లిలో 43.9, మేళ్ళచెర్వు లో 43.9 డి గ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో 39 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికా రులు తెలిపారు. రెండు రోజులుగా జిల్లాలో ఎండలు కాస్త తగ్గుముఖం పట్టాయి.

వడదెబ్బతో మహిళ మృతి



జీవమ్మ (ఫైల్)

నడిగూడెం: సూర్యాపేట జిల్లా, నడిగూడెం మండల కేంద్రానికి చెంది దారా జీవమ్మ (50) సోమవారం వడదెబ్బకు గురై మృతిచెందింది. ఉపాధి కోసం ఇటీవల చెన్నై వెళ్లి వచ్చి అస్వస్థతకు గురైంది. చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు.

వరకట్నం వేధింపులకు వివాహిత బలి

● అత్తింటి వేధింపులు తాళలేక బలవన్మరణం ● యాదాద్రిభువనగిరి జిల్లాలో ఘటన



ఇంటి వద్ద గుమిగూడిన గ్రామస్థులు



నాగమణి(ఫైల్), అమ్మకు దూరమైన చిన్నారులు

యాదగిరిగుట్ట రూరల్, మే 6: వరకట్న వేధింపులకు వివాహిత బలైంది. అధిక కట్నం తీసుకురావాలని అత్తింటి వారు వేధించడంతో తట్టుకోలేక మానసిక ఆందోళనకు గురై ప్రాణాలు తీసుకుంది. సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని యాదగిరిపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. సీఐ రమేష్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మునిసిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి ఎస్సీకాలనీకి చెందిన బూడిద యాదయ్య, దేవమ్మ దంపతుల కుమార్తె నాగమణి(25)కి, జనగామ జిల్లా జనగామ మండలం నాగారం గ్రామానికి చెందిన గడిపె సాయిలు, జానమ్మ దంపతుల కుమారుడు గడిపె ప్రవీణ్‌కు 2020 మార్చి 18 తేదీన కట్నకానుకలు ఇచ్చి యాదగిరిపల్లిలో వివాహం జరిపించారు. ప్రవీణ్ ఓ ప్రైవేటు వైద్యశాలలో కంపౌండర్ కాగా, తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వారికి బాబు వర్షన్(3), తొమ్మిది నెలల కుమార్తె ఉన్నారు. వివాహం జరిగిన సంవత్సరం నుంచే అదనపు కట్నం తీసుకురావాలని అత్తింటి వారు వేధిస్తున్నారు. గతంలో ఇదే విషయమై పలుసార్లు పెద్దమనుషుల మధ్య పంచాయితీ నిర్వహించారు. వేధింపులు అధికమవడంతో నాగమణి ఈ నెల 3వ తేదీన తన పిల్లలతో యాదగిరిపల్లికి వచ్చింది. అదనపు కట్నం తేవాలని భర్త గడిపె ప్రవీణ్, అత్తమామ సాయిలు, జానమ్మ వేధిస్తున్నారని తల్లిదండ్రులతో చెప్పింది. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పిల్లలను ఇంటివద్ద వదిలి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో దూకింది. అప్పటికే తల్లిదండ్రులు నాగమణి కోసం గ్రామంలో వెతుకుతుండగా, రోడ్డు వెంట వెళ్తున్న వారు గమనించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్థులు, తల్లిదండ్రులు హుటాహుటిన బావి వద్దకు చేరుకుని నాగమణిని బావిలో నుంచి బయటికి తీశారు. కొన ఊపిరితో ఉండటంతో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షలు నిర్వహించి ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. నాగమణి తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు నాగమణి భర్త, అత్త, మామలపై వరకట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అమ్మ కావాలని చిన్నారుల రోదన

ప్రతిరోజూ తమ బాగోగులు చూసుకుంటూ తమకు ఆప్యాయత పంచే అమ్మ కనపడకపోవటంతో ఆ చిన్నారులు రోదిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి ఇంటి నుంచి వెళ్లిన నాగమణి బావిలో దూకి ఆత్మహత్య చేసుకోవటంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రిలో ఉంచారు. అమ్మమ్మ భువనగిరి ఏరియా ఆసుపత్రిలో, తాతయ్య పోలీస్ స్టేషన్ వద్ద ఉండటంతో ఇంటి వద్ద ఉన్న చిన్నారులు 'అమ్మ కావాలి' అని ఏడుస్తుంటే అక్కడున్న ప్రతిఒక్కరూ కంట తడిపెట్టారు.

లారీల కొరతతో రైతుల అవస్థలు

ఆరుగాలం కష్టించి పండించిన రైతులు, పంట చేతి కొస్తే విక్రయించడానికి నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని జలాల్‌పురం, రాఘవాపురం గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాల్లో విక్రయించడానికి ధాన్యం తెచ్చిన రైతులు లారీ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలకు నెల రోజుల క్రితం ధాన్యం తెచ్చినా లోడింగ్ కావడం లేదు. దీంతో రైతులు రేయింబవళ్లూ కొనుగోలు కేంద్రాల్లోనే ఉండాల్సి వస్తోంది. వాతావరణ మార్పులతో కొనుగోలు కేంద్రాలను తెచ్చిన ధాన్యం తడిస్తే మొలకలు వచ్చి నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలులో జాప్యంతో పట్టాల అద్దె, ఖర్చులు పెరిగి గిట్టుబాటు కావడంలేదని రైతులు చెబుతున్నారు.

- తిరుమలగిరి రూరల్



జలాల్‌పురం ఐకేపీ కేంద్రంలో లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

జలాల్‌పురం ఐకేపీ కొనుగోలు కేంద్రంలో 2000 బస్తాలు కాంటాలు వేసి లోడింగ్‌కు సిద్ధంగా ఉన్నా, లారీలు లేవు. దీంతో ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కాంటా వేయడంలేదు. దీంతో రైతులు రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. జలాల్‌పురం ఐకేపీ కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని నెల రోజుల క్రితం తీసుకువస్తే 10రోజుల క్రితం తేమ చూశారని, ఇప్పటివరకు కాంటాలు వేసి లోడింగ్ చేయలేదని రైతులు తెలిపారు. బస్తాకు రూ.2చొప్పున లారీ డ్రైవర్లకు మామూలు, క్వింటాల్‌కు రూ.50నుంచి రూ.80వరకు హమాలీలకు ఇస్తున్నామని, లారీల్లో బస్తాలు చినిగి పడిన ధాన్యాన్ని ఎత్తడానికి లారీ డ్రైవర్లు రూ.300డిమాండ్ చేస్తున్నారని కొందరు రైతులు తెలిపారు. ఇదంతా తమపై అదనపు భారం పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో నత్తనడకన కాంటాలు, లోడింగ్

అదనపు తూకంతో దగా..

కొనుగోలు కేంద్రాల్లో 40కిలోల బస్తాకు రెండు నుంచి మూడు కిలోల తూకాన్ని నిర్వాహకులు అదనంగా మోసం చేస్తున్నారని రైతులు తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర వస్తుందని ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో ధాన్యం పోస్తే కొనుగోలు కేంద్రాల్లో నెల రోజుల నిరీక్షణకు ఒక్కో పట్టాకు రోజుకు రూ.50చొప్పున కిరాయి, హమాలీలు, లారీ డ్రైవర్లకు మాములు తదితర లెక్కలు కడితే మార్కెట్ ధర కంటే తక్కువ పడుతోందని రైతులు తెలిపారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

లారీల కొరతతో కాంటాలు వేయలేదు



జలాల్‌పురం ఐకేపీ కొనుగోలు కేంద్రానికి 25రోజుల క్రితం 85క్వింటాళ్ల ధాన్యాన్ని తీసుకువచ్చా. 10రోజుల క్రితం తేమ చూసిన అధికారులు, లారీల కొరతతో ఇప్పటివరకు కాంటాలు వేయలేదు. ధాన్యం తడవకుండా ఉండటానికి తీసుకువచ్చిన పట్టాల కిరాయి పెరుగుతోంది. అకాల వర్షాలు కురుస్తున్నందున ఎప్పుడు ఏం జరుగుతుం దోనని భయాందోళనతో ఉన్నాం. అధికారులు పర్యవేక్షణ చేసి ధాన్యాన్ని త్వరగా మిల్లులకు పంపేలా చర్యలు తీసుకోవాలి.

- వేముల రవి, రైతు, జలాల్‌పురం

కాంటాలు వేయనందున ఇబ్బంది



నేను రాఘవపురం ఐకేపీ కేంద్రానికి 15రోజుల క్రితం ధాన్యం తెచ్చా. ఇప్పటివరకు కాంటాలు వేయనందున ఇబ్బంది పడుతున్నా. అధికారులు చొరవ తీసుకొని కాంటాలు వేసి మిల్లులకు పంపేలా చూడాలి.

- గొడుగు సుజాత, రైతు, రాఘవాపురం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తా

కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత ఉంది. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా. లారీ రావడం ఆలస్యమవుతున్న కారణంగా ధాన్యం తరుగు పోయే అవకాశం ఉంది. దీంతో 40కిలోల బస్తాకు కిలో నుంచి 1.2 కిలోలు ఎక్కువగా తూకం వేయాలని నిర్వాహకులకు చెప్పాం. అదే అలుసుగా 40కిలోల బస్తాకు 2కిలోల నుంచి రెండున్నర కిలోలు అదనంగా నిర్వాహకులు కంటా వేస్తున్నారని నా దృష్టికి వచ్చింది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఆదేశాలు పాటించాలి. లేనట్లయితే చర్యలు తీసుకుంటాం.

- సైదులు, ఏపీఎం, తిరుమలగిరి మండలం

ధాన్యాన్ని వెంటనే తరలించాలి



అడివెంల గ్రామంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మధుసూదన్‌రాజు

అర్వపల్లి, నాగారం మే 6: కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని వెంటనే తరలించి, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రాజు అన్నారు. సోమవారం అర్వపల్లి మండలంలోని అడివెంల, తిమ్మాపురం గ్రామాల్లో, నాగారం మండలంలోని మామిడిపల్లి, ఫణిగిరి గ్రామాల్లో సెర్ప్, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లను రైతులు ఏర్పాటు చేసుకోవాలన్నారు లారీల కొరత లేకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో శోభ, ఈపీఎం లక్ష్మీనారాయణ, ఏపీఎం మల్లేష్, వీవోఏ విజయ, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి

చిలుకూరు, మే 6: పార్లమెంట్ ఎన్నికల విధులను వలంటీర్లు సక్రమంగా నిర్వహించాలని ఎస్ఐ సురభి రాంబాబు, ఎంపీడీవో గిరిబాబు కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల విధులపై వలంటీర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 13వ తేదీన పోలింగ్ బూత్‌ల వద్ద విధులు నిర్వహించే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో 16రోజుల పండుగ



రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నేరేడుచర్ల, మే 6: పట్టణంలోని కోదండ రామాలయంలో సోమవారం 16రోజుల పండుగ నిర్వహించారు. గత నెల 21న ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించగా, గ్రామ పురోహితుడు నెమ్మాని వెంకటరమణ, ఆలయ పూజారి ఆశిష్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పంచామృతాభిషేకాలు, గణపతిపూజ, పుణ్యాహవాచనం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సుందరాకాండ పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



గమన్‌రెడ్డిని సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, మే 6: తైక్వాండో పోటీల్లో జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి అంతర్జాతీయ స్థాయికి భారత్ తరఫున ఎంపికైన కొణతం గమన్‌రెడ్డి రాణించి బంగారు పతకం తీసుకురావాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ బట్టు మధు అన్నారు. సోమవారం రాత్రి నేరేడుచర్లలోని కోదండరామాలయం ప్రాంగణంలో గమన్‌రెడ్డిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా గమన్‌రెడ్డి మాట్లాడుతూ అర్జెంటీనా, నేపాల్ దేశాల్లో త్వరలో జరగబోయే తైక్వాండో 25కిలోల విభాగంలో బంగారు పతకం సాధించేందుకు సాధన చేస్తున్నానని, అందరి ఆశీర్వాదంతో విజయం సాధించి దేశానికి పేరు తెస్తానన్నారు. అనంతరం కొణతం గమన్‌రెడ్డి తండ్రి ఉదయ్‌కుమార్‌రెడ్డిని, తాత, నాయనమ్మ కొణతం సత్యనారాయణరెడ్డి, విజయలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కొణతం సీతారాంరెడ్డి, యడవెల్లి సత్యనారాయణరెడ్డి, రావులపల్లి ప్రసాద్, చిత్రం విశ్వనాథం, జిలకర రామస్వామి, సుంకర క్రాంతికుమార్, కృపాకర్, పోరెడ్డి శ్రీరాంరెడ్డి, సూరిబాబు, లక్ష్మారెడ్డి, కొప్పుల రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



కబడ్డీ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ సురేందర్‌రెడ్డి, రామచందర్‌గౌడ్

హుజూర్‌నగర్, మే 6: యువత క్రీడల్లో రాణించాలని హుజూర్‌నగర్‌కు చెందిన ఏసీపీ, కబడ్డీ జాతీయ క్రీడాకారుడు సుంకి సురేందర్‌రెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ రామచందర్ గౌడ్ అన్నారు. వేసవి ఉచిత కబడ్డీ శిక్షణా శిబిరాన్ని సోమవారం పట్టణంలోని ఎన్సెస్పీ క్యాంపులో ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, స్నేహభావం పెరుగుతుందని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో కబడ్డీకి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. కబడ్డీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవరం రవీందర్‌రెడ్డి, సునీల్, చిరంజీవి, మస్తాన్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డ దేవాలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ రూరల్, మే 6: మండలంలోని బూరుగడ్డ గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో హరీష్‌కుమారాచార్యులు, మనోహర్, భిక్షం, నరసింహారావు, గురవయ్య, గంగయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



తుంగతుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

తుంగతుర్తి, సూర్యాపేట టౌన్, పెన్‌పహాడ్, కోదాడ టౌన్, చిలుకూరు, చివ్వెంల, మద్దిరాల, మే 6: కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. తుంగతుర్తి మండలంలోని బండరామారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ తాజా మాజీ సర్పంచ్ ఉప్పునూతల ప్రణీతజయచందర్‌రెడ్డి, బీఆర్ఎస్‌కు చెందిన 20కుటుంబాలు, మాజీ ఎంపీటీసీ రేగటి రవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సామేలు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా సామేలు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చెవిటి వెంకన్నయాదవ్, అనురాధ సైదులు, గోవర్ధన్ పాల్గొన్నారు.

● పేదల గుండె చప్పుడు కాంగ్రెస్ పార్టీ అని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ముదిరెడ్డి రంగారెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అదే విధంగా పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కాయకుడు ముదిరెడ్డి రంగారెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు పటేల్ రమేష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

● నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ సూర్యాపేటలోని 24, 25 వార్డుల్లో పటేల్ రమేష్‌రెడ్డి ప్రచారం చేశారు.

● రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కోదాడ పట్టణంలో, చిలుకూరు చివ్వెంల మండలాల్లో, కోదాడ మండలం గుడిబండ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. ప్రచారం చేసిన వారిలో పీసీసీ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, కోదాడ మునిసిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, కీత వెంకటేశ్వర్లు, పిండ్రాతి హనుమంతరావు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, సర్వోత్తంరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

● భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మద్దిరాల మండలం కేంద్రంలో, పోలుమళ్ల గ్రామంలో ఎమ్మెల్యే మందుల సామేలు కుమారుడు మందుల సూర్యకిరణ్ ప్రచారం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాగులపాటిఅన్నారంలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెన్‌పహాడ్, అర్వపల్లి, మే 6: పెన్‌పహాడ్, అర్వపల్లి మండలాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. పెన్‌పహాడ్ మండలం నాగులపాటిఅన్నారం జడ్పీహైస్కూల్‌లో 2003-04 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు, అర్వపల్లి మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర సహకార జూనియర్ కళాశాల 2002-04 ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మామిడి రాంమూర్తి, డి.వెంకటేశ్వర్లు, రవి, రమేష్, వెంకటేశ్వర్లు, జ్యోతుల సుధాకర్, వీరానారాయణ, మాధవి, జానకమ్మ, పరిపూర్ణాచారి, మహేష్, పులిచర్ల ప్రభాకర్, మురళి, నాగుల్‌మీరా, ఎల్లయ్య పాల్గొన్నారు.



అర్వపల్లిలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మాజీ సర్పంచ్ మృతి

అర్వపల్లి, మే 6: మండలంలోని కుంచమర్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మన్నె దశరథ(75) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. దశరథ మృతదేహంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, మారిపెద్ది శ్రీనివాస్, గుండగాని సోమేష్ గౌడ్, రాజు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



అడివెంల గ్రామంలో ఆర్థికసాయం అందజేస్తున్న మత్స్యశాఖ సొసైటీ సభ్యులు

అర్వపల్లి, మే 6: మృతురాలి కుటుంబానికి మత్స్యశాఖ సొసైటీ సభ్యులు ఆర్థికసాయం అందించారు. సూర్యాపేటలోని ఓ హోటల్‌లో పనిచేస్తుండగా, గ్యాస్ సిలిండర్ పేలడంతో అర్వపల్లి మండలం అడివెంల గ్రామానికి చెందిన ఉత్తీర్ల సక్కుబాయి(51)ఇటీవల తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మత్స్యశాఖ సంఘం ఆధ్వర్యంలో మృతురాలి భర్త సత్తయ్యకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సొసైటీ చైర్మన్ పిట్టల జానయ్య, యాదగిరి, బండారు నాగరాజు, పేరెల్లి లింగయ్య, బోయపల్లి సైదులు, వెంకన్న పాల్గొన్నారు.

అమలుచేయలేని హామీలను నమ్మొద్దు



కోదాడలోమాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి, అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

కోదాడ టౌన్, సూర్యాపేట(కలెక్టరేట్), హుజూర్‌నగర్, మఠంపల్లి, సూర్యాపేట రూరల్, మద్దిరాల, నాగారం, మే 6: పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అమలుచేయలేని హామీలను ప్రజలు నమ్మొద్దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి కోరారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కోదాడలో రంగా థియేటర్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి లబ్ధి పొందిందని, ఆ హామీలను నెరవేర్చలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి హామీలు ఇస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, సత్తయ్యగౌడ్, చింతా కవితారెడ్డి, కౌన్సిలర్ పద్మజ పాల్గొన్నారు.

● మహిళలకు రూ.2500 ఇచ్చామని ఏఐసీసీ సభ్యుడు రాహుల్ గాంధీ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సతీమణి సునీత, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సతీమణి రమాదేవి అన్నారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని 23, 31వార్డులతో పాటు పలు వార్డుల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణతో కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, విక్రమ్ పాల్గొన్నారు.

● నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ హుజూర్‌నగర్ మండంలోని అమరవరంలో, మఠంపల్లి మండల కేంద్రంలో, సూర్యాపేట మండలం బాలెంల గ్రామంలో ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. ప్రచారంలో జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మాజీ సర్పంచ్ గుజ్జుల సుజాత, జడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్, ఇరుగు పిచ్చయ్య, వైఎస్ ఎంపీపీ శ్రీనివాస్‌నాయుడు, వంగాల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని కోరతూ మద్దిరాల మండలంలోని రెడ్డిగూడెం, రామచంద్రాపురం గ్రామాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎస్‌ఏ రజాక్ ప్రచారం చేశారు. అదేవిధంగా నాగారం మండలంలోని పసునూరు గ్రామంలో మల్లేష్‌కు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.ఉప్పలయ్య ప్రచారం చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

● ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

హుజూర్‌నగర్, మే 6: పట్టణంలో నిర్మాణంలో మినీ ట్యాంకు బండ్‌పై ఉన్న విద్యుత్ స్తంభాన్ని సోమవారం ఉదయం 11గంటలకు ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో విద్యుత్ స్తంభం కూలింది. దీంతో విద్యుత్ తీగలు తెగిపడటంతో పట్టణం లోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు మధ్యాహ్నం రెండు గంటలకు మరమ్మతు పనులు ప్రారంభించి, సాయంత్రం వరకు పూర్తి చేశారు. దీంతో ఆరు గంటల పాటు విద్యుత్ లేనందున ఎండ వేడిమికి ఉక్కపోతతో పట్టణ ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ప్రజలు విద్యుత్ అధికారులకు ఫోన్ చేసినా స్పందించలేదు. పట్టణంలో వారం రోజులుగా అన్ని వేళల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. లైన్‌మన్, ఏఈకి ఫోన్ చేసినా స్పందించడంలేదని ప్రజలు చెబుతున్నారు. మునిసిపాలిటీ పరిధిలో విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్ హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు



తుంగతుర్తిలో కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న సంకినేని వెంకటేశ్వరరావు

సూర్యాపేట సిటీ, తుంగతుర్తి, మఠంపల్లి, నూతనకల్, మే 6: కాంగ్రెస్ హామీలను ప్రజలు మరోమారు నమ్మే స్థితిలో లేరని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు సంకినేని సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, మునిసిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, సలిగంటి వీరేందర్, ఎండీ అబీద్, చల్లమల్ల నరసింహ, రంగినేని లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● బీఆర్ఎస్ బండరామారం గ్రామశాఖ అధ్యక్షుడు విరబోయిన రమేష్, బీఆర్ఎస్‌వీ నాయకుడు బొల్లోజు నరేష్ ఆ పార్టీకి రాజీనామా చేసి, తుంగతుర్తిలో సంకినేని వెంకటేశ్వర్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం సుభిక్షంగా ఉంచడం బీజేపీకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సంకినేని వరుణ్‌రావు, సంకినేని రవీందర్‌రావు, మల్లెపాక సాయిబాబా, గాజుల మహేందర్, పుప్పాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

● నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని కోరుతూ మఠంపల్లి మండలంలోని తుమ్మలతండాలో ఆ పార్టీ నాయకుడు శివాజీ రాథోడ్ ప్రచారం చేశారు. కార్యక్రమంలో సైదానాయక్, అశోక్‌నాయక్, హుస్సేన్‌నాయక్, రంగానాయక్, బద్యానాయక్ పాల్గొన్నారు.

● నూతనకల్ మండలంలోని ఉన్న మాదిగల మద్దతు బీజేపీకేనని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ భువనగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందుకూరి సోమన్న మాదిగ అన్నారు. మండలంలోని వెంకేపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆయన ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్వాయి పరశురాములు రాము, మధు, నరేష్, వెంకన్న తదితరులు ఉన్నారు.

కార్డన్‌సెర్చ్‌లో 36వాహనాలు స్వాధీనం

గరిడేపల్లి, మే 6: మండలంలోని సమస్యాత్మక గ్రామమైన వెలిదండలో ఎస్ఐ ఈట సైదులు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డన్‌సెర్చ్‌లో ఎటువంటి పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 35ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను గుర్తించి సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కార్డన్‌సెర్చ్‌లో హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఆరుగురుఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, సీఐఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

అవసరం మేరకే విద్యుత్‌ను వినియోగించుకోవాలి

కోదాడ రూరల్, మే 6: అవసరం మేరకే రైతులు విద్యుత్‌ను వినియోగించుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నెం పాపిరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని రామలక్ష్మీపురం, బీకేతండా గ్రామాల్లో విద్యుత్ వినియోగంపై రైతులకుసలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో రైతులు సక్రు, బాలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

గరిడేపల్లి, మే 6: ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికలు జరగడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని గరిడేపల్లి ఎస్ఐ ఈట సైదులు కోరారు. సోమవారం మండలంలోని పొనుగోడు తదితర గ్రామాల్లో కేంద్ర బలగాలు, పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఐ నలిగంటి నరేష్, పాల్గొన్నారు.